7
సాక్షి సంగారెడ్డి
ఆదివారం । 6 । జూలై । 2025

బిర్యానీ.. ప్రియులమండి



సండే స్పెషల్

సందర్భమేదైనా విందులో బిర్యానీ కామన్. శాకాహార, మాంసాహారులకు సైతం బిర్యానీ అంటే ఇష్టంగా ఆరగించేస్తారు. బిర్యానీ ప్రియుల ఇష్టాన్ని తీర్చేలా కొందరు ఆకర్షణీయమైన హోటళ్లతో వ్యాపారం చేయడం ఇప్పుడు నయా ట్రెండ్. వెజ్, నాన్‌వెజ్ రుచులలో జైలు బిర్యానీ, రైలు బిర్యానీ, మండీ బిర్యానీ వంటి పేర్లతో వినియోగదారులను ఆకర్షిస్తూ మూడు ప్లేట్లు, ఆరు లెగ్‌పీసులుగా వర్ధిల్లుతూ నాలుగు రాళ్లు వెనకేసుకుంటున్నారు హోటల్ వ్యాపారులు. జూలై మొదటి ఆదివారం అంతర్జాతీయ బిర్యానీ దినోత్సవం సందర్భంగా జిల్లాలో హోటళ్లలో అందించే రకరకాల బిర్యానీలపై 'సండే స్పెషల్'... 8లో

న్యూస్‌రీల్

మగ్గం వర్క్స్‌లో ఉచిత శిక్షణ

సంగారెడ్డి టౌన్: మగ్గం వర్క్స్‌లో ఉచిత శిక్షణ మహిళలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ డైరెక్టర్ వంగ రాజేంద్రప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంగారెడ్డి, మెదక్ జిల్లాలోని మహిళలకు ఈనెల 10 నుంచి నెల రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు. ట్రైనింగ్ పూర్తయిన తర్వాత మహిళలకు సర్టిఫికెట్లను అందజేస్తామని తెలిపారు. 18 నుంచి 45 ఏళ్ల వయసు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు సంగారెడ్డి బైపాస్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రంలో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 94901 29839, 94901 03390 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మితే చర్యలు



ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఏఓ వినయ్

మనోహరాబాద్(తూప్రాన్): ఎరువుల దుకాణంలో నకిలీ విత్తనాలు, నాణ్యత లేని ఎరువులను రైతులకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి విన్సెంట్ వినయ్‌కుమార్ హెచ్చరించారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలని ఆదేశించారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి స్రవంతి తదితరులు ఉన్నారు.

మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దు

మెదక్ కలెక్టరేట్: జిల్లాలోని లైసెన్స్ పొందిన మత్స్యకారులు రెండు నెలల పాటు మంజీరా నది, హల్దీవాగు, పోచారం రిజర్వాయర్లలో చేపలు పట్టొద్దని జిల్లా మత్స్యశాఖ అధికారి మల్లేశం శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూలై, ఆగస్టు మాసాల్లో కార్స్ జాతికి చెందిన చేపలు, చేప పిల్లలను ఉత్పత్తి చేసే సమయమని తెలిపారు. రిజర్వాయర్, మేజర్ ప్రాజెక్టులలో చేపల సంతానోత్పత్తికి ఆటంకం కలుగకుండా చేపల వేటను నిషేధించినట్లు చెప్పారు. నిబంధనలు ఉల్లంఘించిన మత్స్యకారుల లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు.

ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలి

నారాయణఖేడ్: రైతులకు జారీ చేయనున్న 11 అంకెల విశిష్ట గుర్తింపు కార్డు కేటాయింపునకు రైతుల పేర్ల నమోదు ప్రక్రియను ఏడీఏ నూతన్ కుమార్ శనివారం పరిశీలించారు. మనూరు మండలంలోని అతిమ్యాల్, రాణాపూర్ గ్రామాల్లో ఆయన ఏఓ మహేష్ చౌహాన్, ఏఈఓలు ప్రవీణ్ చోల్కర్, సంధ్యలతో కలిపి పర్యటించారు. విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదుకు భూ యాజమాన్య పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్, ఫోన్ నంబర్‌తో నమోదు చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ సంఖ్య కేంద్రం పథకాల అమలు, పీఎం కిసాన్‌లో తదుపరి విడత నిధులకు దీనినే ప్రమాణికంగా తీసుకుంటారని చెప్పారు.

సిగాచీ యాజమాన్యాన్ని అరెస్ట్ చేయాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

సంగారెడ్డిఎడ్యుకేషన్/పటాన్‌చెరుటౌన్: సిగాచీ కెమికల్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని, తక్షణమే మృతుల కుటుంబాలకు రూ. కోటి పరిహారం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్క రాములు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా రాములు మాట్లాడుతూ.. పరిశ్రమల్లో సౌకర్యాలపై తనిఖీలు నిర్వహించని అధికారులను సస్పెండ్ చేయాలన్నారు. ప్రమాదానికి కారణమైన పరిశ్రమ యాజమాన్యాన్ని ఇప్పటివరకు అరెస్టు చేయకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు. అనంతరం బాధిత కుటుంబాలకు రూ. 5 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు, కార్యదర్శి వర్గ సభ్యుడు మల్లేశం, రాజయ్య, మాణిక్, సాయిలు, నర్సింలు, జిల్లా కమిటీ సభ్యులు నాగేశ్వర్‌రావు, విద్యాసాగర్, కృష్ణ, నాయకులు పాండురంగారెడ్డి, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిట్టి చేతులకు వెట్టి విముక్తి

జిల్లాలో బాలకార్మిక వ్యవస్థను పూర్తిస్థాయిలో రూపుమాపేందుకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా అధికారులు ఈ ఏడాది కూడా జూలై మాసంలో చేపట్టే ఆపరేషన్ ముస్కాన్‌ను ప్రారంభించారు. ఈనెల 1వ తేదీన ప్రారంభమైన కార్యక్రమం ఈనెలాఖరు వరకు కొనసాగించనున్నారు. బడీడు పిల్లలు బడిలో చేర్పించడం.. సమస్యల్లో కొట్టు మిట్టాడుతున్న వారికి అపన్నహస్తం అందించడం.. తప్పిపోయిన వారిని గుర్తించి తల్లిదండ్రుల వద్దకు చేర్చడం లక్ష్యంగా ఆపరేషన్ ముస్కాన్ కొనసాగనుంది.

– నారాయణఖేడ్



- కొనసాగుతున్న ఆపరేషన్ ముస్కాన్
- జిల్లాలో నాలుగు బృందాల ఏర్పాటు
- నెలాఖరు వరకు తనిఖీలు

ఆపరేషన్ ముస్కాన్ వివరాలు	
సంవత్సరం	గుర్తించిన బాల కార్మికులు
2021	74
2022	91
2023	56
2024	84

ఆపరేషన్ స్మైల్ వివరాలు	
సంవత్సరం	గుర్తించిన బాల కార్మికులు
2021	63
2022	77
2023	112
2024	83
2025	98

జిల్లాలో 0 నుంచి 18 ఏళ్లలోపు బాలలు 2.60 లక్షల మంది వరకు ఉంటారని అధికారుల అంచనా. ఈ నేపథ్యంలో ఎంతమంది సంపూర్ణంగా హక్కులు పొందుతున్నారు.. ఎంత మంది జీవితాలు దుర్భరంగా మారాయి అనే అంశాలను విశ్లేషిస్తారు. ఇప్పటికే జిల్లా అధికారులతో సమీక్ష పూర్తయ్యింది. జిల్లాలో బాల కార్మికులను గుర్తించి వెట్టి నుంచి విముక్తి చేయాల్సిందిగా పలు శాఖల అధికారులకు దిశా నిర్దేశం చేశారు. నారాయణఖేడ్, సంగారెడ్డి, జహీరాబాద్, పటాన్‌చెరు నాలుగు పోలీస్ డివిజన్లు కలిపి నాలుగు బృందాలను ఏర్పాటు చేశారు.

పని ప్రదేశాల సందర్శన

ఈ బృందాలు ఇటుక బట్టీలు, బస్టాండ్లు, హోటళ్లు, దాబాలు, దుకాణాలు, బేకరీలు, వ్యాపార సంస్థలు, ఇతర పని ప్రదేశాలు, ఇతర రాష్ట్రాల నుంచి తరలివచ్చి కార్మికులను పనులు చేసే ప్రాంతాలను ప్రధానంగా సందర్శించనున్నారు. ఈ క్రమంలో గుర్తించిన వారిని బాలల సంరక్షణ సమితి ఎదుట ప్రవేశపెట్టి వారి జీవితానికి కొత్తబాటలు వేస్తారు. బాల కార్మికులను వసతి గృహాల్లో చేర్పి బడికి పంపిస్తారు. ఆడ పిల్లలను కేజీబీవీల్లో చేర్పుతారు. అనాథలను జిల్లాలోని బాల సదనం, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంరక్షణ కేంద్రాలకు తరలిస్తారు. భిక్షాటన చేసే పిల్లలకు విముక్తి కల్పిస్తారు. బాల్య వివాహాలు జరిగిన వారు ఉంటే వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి పిల్లలను వసతి గృహాలకు తరలించి చదువు చెప్పిస్తారు. 18 ఏళ్లు నిండిన తర్వాత వారి కుటుంబానికి అప్పగిస్తారు.

ఏడాదిలో రెండుసార్లు..

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా జనవరిలో ఆపరేషన్ స్మైల్, జూలైలో ఆపరేషన్ ముస్కాన్ పేరిట కార్యక్రమాలను నిర్వహిస్తారు. మొదటి వారం బాలల సంరక్షణ కేంద్రాలను సందర్శించి అడ్రస్ లేని పిల్లలు, తప్పిపోయిన పిల్లలను గుర్తిస్తారు. దర్పన్ పోర్టల్‌లో ఫొటోలను అప్‌లోడ్ చేస్తారు. రెండవ వారం రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించనున్నారు. 0 నుంచి 18 ఏళ్ల వయసు గల పిల్లలను గుర్తిస్తారు. 14 ఏళ్లలోపు పిల్లలు ఎలాంటి పనులు చేసేందుకు వీలు లేదు. 14 నుంచి 18 ఏళ్ల వయస్సు గల పిల్లలు కూడా ప్రమాదకర రంగాలైన వెల్డింగ్, గాజు, టపాసుల పరిశ్రమ తదితర ప్రమాదకర ప్రదేశాల్లో పని చేయించకూడదు. బాలల హక్కులకు ఎలాంటి భంగం కలిగించినా చైల్డ్ లైన్ టోల్ ఫ్రీ నంబరు 1098ను సంప్రదించవచ్చు.

సిగాచీలో కనీస భద్రత చర్యలు లేవు

- ఉష్ణోగ్రత పెరిగితే హెచ్చరించే వ్యవస్థే లేదు..
- కరకట్ ఎంపీ రాజారామ్‌సింగ్



కార్మికుల వివరాలను తెలుసుకుంటున్న ఎంపీ రాజారామ్‌సింగ్

పటాన్‌చెరు: ఉష్ణోగ్రత పెరిగినప్పుడు హెచ్చరించే వ్యవస్థే సిగాచీ పరిశ్రమలో లేదని బిహార్‌లోని కరకట్ ఎంపీ రాజారామ్‌సింగ్ అన్నారు. శనివారం పాశమైలారం పారిశ్రామికవాడలోని సిగాచీ పరిశ్రమ, ఐలా భవనాన్ని సందర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సిగాచి పరిశ్రమలో కనీస భద్రత చర్యలు లేవని, పరిశ్రమ నిర్వాహకులు రిజిస్టర్ కాలిపోయిందని చెప్పడం దారుణం అన్నారు. పరిశ్రమలకు రెండు రిజిస్టర్ కాపీలు ఉంటాయని తెలిపారు. మరో రిజిస్టర్ బయటపెట్టాలని, ఎందుకు దాస్తున్నారని ప్రశ్నించారు. పరిశ్రమలో కాంట్రాక్టు కార్మికులు చాలా మంది పనిచేస్తున్నారని, రిజిస్ట్రేషన్ చేయించలేదని ఆరోపించారు. అందుకే కార్మికుల వివరాలను దాస్తున్నారని అన్నారు. హఠాత్తుగా ప్రమాదం జరిగిందని చెబుతున్నారు.. అది ఎలా సాధ్యం అవుతుందని ప్రశ్నించారు. ఎంపీ వెంట సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ కేంద్ర కమిటీ సభ్యుడు మాజీ ఎమ్మెల్యే మనోజ్ మంజిల్ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న శిథిలాల తొలగింపు

పటాన్‌చెరు టౌన్: పాశమైలారం పారిశ్రామికవాడలోని సిగాచీ ఫార్మా పరిశ్రమలో ఇంకా ఆచూకీ తెలియని కార్మికుల వెతుకులాట పనులు కొనసాగుతున్నాయని కలెక్టర్ ప్రావీణ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరిశ్రమ ప్రతినిధులు అందించిన వివరాల ప్రకారం, ప్రమాదం జరిగిన సమయంలో 143 మంది కార్మికులు పనిచేస్తుండగా, 61 మంది కార్మికులు క్షేమంగా ఉన్నారని పేర్కొన్నారు. 21 మంది కార్మికులు వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతుండగా, 12 మంది కోలుకొని డిశ్చార్జ్ అయ్యారని చెప్పారు. ప్రమాదంలో మొత్తం 40 మంది కార్మికులు మృతిచెందగా, వీరిలో 38 మంది మృతదేహాలు గుర్తించి పోస్టుమార్టం నిర్వహించి వారి బంధువులకు అప్పగించామన్నారు. ఇంకా ఇద్దరు కార్మికుల మృతదేహాలను గుర్తించాల్సి ఉందన్నారు. పరిశ్రమలో పనిచేస్తున్న 9 మంది కార్మికుల ఆచూకీ ఇంకా లభించలేదన్నారు. వీరి ఆచూకీ కోసం పరిశ్రమలో శిథిలాల తొలగింపు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటివరకు 34 మంది మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం తరఫున రూ. లక్ష, గాయపడిన కార్మికులకు రూ. 50 వేల చొప్పున తక్షణ సహాయం అందించామన్నారు. ఆచూకీ తెలియని తొమ్మిది మంది కార్మికుల కుటుంబ సభ్యులకు రూ. పది వేల ఆర్థిక సహాయం అందజేసినట్లు తెలిపారు.

21 కొత్త పాఠశాలలు మంజూరు

- అర్బన్ ఏరియాల్లో 19, గ్రామీణ ప్రాంతాల్లో రెండు
- అత్యధికంగా జహీరాబాద్ పట్టణంలో 10 స్కూళ్లు ఏర్పాటు



జహీరాబాద్: సంగారెడ్డి జిల్లాకు 21 కొత్త పాఠశాలలు మంజూరయ్యాయి. ప్రభుత్వం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. అర్బన్ ఏరియాలో 19, గ్రామీణ ప్రాంతాల్లో రెండు పాఠశాలలను ఏర్పాటు చేయనున్నారు. 20 మంది విద్యార్థులుంటే కొత్తగా పాఠశాలలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పట్టణ ప్రాంతాల్లో ఒక కిలో మీటరు కంటే ఎక్కువ దూరంలో ప్రభుత్వ పాఠశాలలు ఉంటే సదరు కాలనీల్లో కొత్తగా స్కూల్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. జహీరాబాద్ పట్టణంలోని బాబూమోహన్ కాలనీ, రాచన్నపేట్, దత్తగిరి కాలనీ, క్రిస్టియన్ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, ఆదర్శనగర్, చెన్నారెడ్డి నగర్ కాలనీ, మహీంద్ర కాలనీ, వసుంధరకాలనీ, ఆనంద్‌నగర్ కాలనీల్లో కొత్తగా పాఠశాలలను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. సంగారెడ్డి పట్టణంలోని బృందావన్ కాలనీ, గీతానగర్, ఓడీఎఫ్‌కాలనీ, ప్రగతి నగర్, సదాశివపేట పట్టణంలోని హనుమాన్ నగర్ కాలనీల్లో కొత్త పాఠశాలలు ఏర్పాటు కానున్నాయి. తెల్లాపూర్ పట్టణంలోని 2 బీహెచ్‌ఈఎల్ కాలనీ, జ్యోతిరావుపూలే కాలనీ, 2 బీహెచ్‌కే కేసీఆర్-2 కాలనీలలో పాఠశాలలను ఏర్పాటు చేసేందుకు గుర్తించారు. ఇక గ్రామీణ ప్రాంతాల విషయానికి వస్తే రాయికోడ్ మండలంలోని చిమ్నాపూర్, మొరట్గా గ్రామాల్లో కొత్త పాఠశాలలు ఏర్పాటు కానున్నాయి. కొత్తగా పాఠశాలలను ఏర్పాటు చేసేందుకు గుర్తించిన ప్రాంతాల్లో విద్యార్థుల సంఖ్యను సైతం లెక్కకట్టారు. ఈ మేరకు కొత్త పాఠశాలల ఏర్పాటుకు నిర్ణయించారు.

తక్షణమే ప్రారంభిస్తాం

ప్రభుత్వ ఆదేశాల మేరకు తక్షణమే పాఠశాలను ప్రారంభించి విద్యాబోధన మొదలు పెడతాం. ఇప్పటికే పాఠశాలలను ఎక్కడ ప్రారంభించాలనే విషయమై లొకేషన్లను గుర్తించాం. అందుబాటులో ఉన్న ప్రభుత్వ భవనాలు, గ్రామ పంచాయతీ భవనాలను తరగతుల నిర్వహణ కోసం వినియోగించుకుంటాం. విద్యార్థుల సంఖ్యను ముందస్తుగానే గుర్తించినందున వారిని పాఠశాలలో చేర్పించేలా చూస్తాం. ఉపాధ్యాయులు అధికంగా ఉన్న ప్రాంతాల నుంచి కొత్త పాఠశాలకు సమకూర్చనున్నాం. 20 మంది విద్యార్థులు బడికి వచ్చేలా చర్యలు చేపడతాం.

– వెంకటేశ్వర్లు, డీఈఓ

9 నుంచి సదరం క్యాంపులు

జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి పీడీ శ్రీనివాసరావు

మెదక్ కలెక్టరేట్: ఈనెల 9 నుంచి నిర్వహించనున్న సదరం క్యాంపుల తేదీలను మీ సేవలను కేటాయించినట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి పీడీ శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో దివ్యాంగులను గుర్తించి సదరం సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. దివ్యాంగులు తమ సర్టిఫికెట్ల రెన్యూవల్, కొత్త గుర్తింపు కార్డులకోసం మీసేవలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

చదువుతోనే మంచి భవిష్యత్తు

కలెక్టర్ ప్రావీణ్య



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

పటాన్‌చెరు టౌన్: భవిష్యత్తు బాగుండాలి అంటే బాగా చదువుకోవాలని కలెక్టర్ ప్రావీణ్య విద్యార్థులకు సూచించారు. శనివారం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా విద్యార్థులకు అందుతున్న వసతులు, హాస్టల్ల పరిశుభ్రత, ఆహార నాణ్యత, బోధన విధానాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడి సమస్యలు, అవసరాలు, అభిప్రాయాలు స్వయంగా తెలుసుకున్నారు. విద్యార్థుల భద్రతపై నిరంతరం నిఘా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. టాయిలెట్లు, భోజనశాల, వసతి గృహాలను పరిశీలించి అవసరమైన అభివృద్ధిపై అధికారులకు సూచనలు చేశారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకొని కష్టపడి చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఆమె వెంట ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

యథేచ్ఛగా చెట్ల నరికివేత



వడ్డేపల్లి శివారులోని ప్రధాన రహదారికి ఇరువైపులా చెట్లను నరికివేస్తున్న దృశ్యం

హత్నూర(సంగారెడ్డి): మండలంలోని వడ్డేపల్లి నుంచి జిన్నారం వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా భారీగా పెరిగిన వృక్షాలను శనివారం కొందరు ఇష్టారాజ్యంగా నరికివేశారు. సమస్య లేకున్నా అక్రమార్జనే ధ్యేయంగా నరికివేసినట్లు తెలిసింది. గ్రామస్థాయి అధికారులతో కుమ్మక్కై చెట్లను నరికివేసినట్లు తెలిసింది. ప్రధాన రహదారిపై చెట్లను నరికివేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. రెవెన్యూ అధికారులకు తెలపగా, తమకు ఎలాంటి సమాచారం లేదన్నారు. ఇదే విషయమై ఆర్‌అండ్‌బీ డీఈ రవీందర్‌ను వివరణ కోరగా చెట్ల నరికివేత విషయం తమ దృష్టికి రాలేదన్నారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను నరికే ముందు తహసీల్దార్‌తో పాటు రోడ్డు భవనాల శాఖ అధికారుల అనుమతి సైతం తీసుకోవాలన్నారు.

ఉల్లాస్‌తో సంపూర్ణ అక్షరాస్యత



మహిళలతో అధికారులు

జిల్లా వయోజన విద్యాధికారి మురళి

నర్సాపూర్ రూరల్: నిరక్షరాస్యత నిర్మూలన కోసమే జాతీయస్థాయిలో ఉల్లాస్ కార్యక్రమం ప్రవేశ పెట్టినట్లు జిల్లా వయోజన విద్యాధికారి మురళి తెలిపారు. శనివారం మండలంలోని బ్రాహ్మణపల్లిలో ఐకేపీ ఏపీఎం గౌరీశంకర్ ఆధ్వర్యంలో మహిళా సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా సంఘాలు గ్రామాల్లోని నిరక్షరాస్యులను గుర్తించడంతో పాటు వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని సూచించారు. మధ్యలో బడి మానేసిన వారిని గుర్తించి బడిలో చేర్పించాలన్నారు. మహిళా సంఘాల సభ్యులు ఇంటింటికీ తిరిగి నిరక్షరాస్యులను గుర్తించి వారి పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. ఉల్లాస్ కార్యక్రమం ద్వారా నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో స్టేట్ ఓపెన్ ఇంటర్, టెన్త్ కోఆర్డినేటర్లు జ్యోతి, శంకర్, పూర్వ సాక్షర భారత్ కోఆర్డినేటర్ సుధీర్ గౌడ్, సీసీ భాగ్య, సీఏ శైలజ, గ్రామ సంఘాల లీడర్లు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పలువురు ఎంపీడీఓల బదిలీ

సంగారెడ్డి జోన్: పలువురు ఎంపీడీఓలు బదిలీ అయ్యారు. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన బదిలీల్లో భాగంగా జిల్లా నుంచి ఇద్దరు అధికారులను బదిలీ చేయగా, ముగ్గురు సంగారెడ్డి జిల్లాకు వచ్చారు. బదిలీ అయిన అధికారులు సంబంధిత జిల్లాలో రిపోర్టు చేయగా, అక్కడి నుంచి వివిధ మండలాలకు బదిలీ కానున్నారు. 2024 ఫిబ్రవరి 10న పార్లమెంట్ ఎన్నికల సమయంలో వివిధ జిల్లాలకు ఎంపీడీఓలు బదిలీ అయ్యారు. ఇటీవల బదిలీల ప్రక్రియ చేపట్టేందుకు అధికారుల నుంచి ఆప్షన్లు తీసుకున్నారు.

బదిలీ అయిన ఎంపీడీఓల వివరాలు		
అధికారి పేరు	ప్రస్తుత జిల్లా	బదిలీ అయిన జిల్లా
వి.సుధాకర్	సంగారెడ్డి	నల్గొండ
ఎ.చంద్రశేఖర్	నల్గొండ	సంగారెడ్డి
ఎల్.మల్సూర్	సంగారెడ్డి	సూర్యాపేట
పి.మంజుల	నల్గొండ	సంగారెడ్డి
జి.సి.శారదదేవి	నల్గొండ	సంగారెడ్డి

సర్కారు బడిలో సోలార్ పొయ్యి!

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తుంది. అలాగే కట్టెల పొయ్యిపై వంట చేస్తూ తరచూ అనారోగ్యం బారిన పడుతున్న కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ముందుకొచ్చింది. ప్రభుత్వ పాఠశాలల్లో సోలార్ కిచెన్ షెడ్ల ఏర్పాటుకు కసరత్తు ప్రారంభించింది.

– సంగారెడ్డి జోన్



కట్టెల పొయ్యిపై వంట చేస్తున్న కార్మికురాలు

- ప్రభుత్వ పాఠశాలల్లో సోలార్ కిచెన్ షెడ్లు
- కసరత్తు చేస్తున్న ప్రభుత్వం
- వంట కార్మికులకు తప్పనున్న ఇబ్బందులు

జిల్లాలోని పాఠశాలల వివరాలు	
ప్రభుత్వ పాఠశాలలు	1,248
మోడల్ స్కూల్స్	10
కేజీబీవీ	22
విద్యార్థులు	1,20000

జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో అక్షయపాత్ర ద్వారా మధ్యాహ్న భోజనం సరఫరా చేస్తున్నారు. ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో సుమారు 1,800 మందికి పైగా వంట కార్మికులు పని చేస్తున్నారు. గతంలో కొన్ని రోజులు గ్యాస్ సిలిండర్లపై వంట చేసిన కార్మికులు, ఖర్చులు అధికం కావడంతో కట్టెల పొయ్యి మీదనే కొనసాగిస్తున్నారు. దీంతో పాఠశాలల పరిసరాల్లో పొగ చేరి మహిళలతో పాటు విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలంలో కట్టెలు తడిసిపోయి మంట మండకపోవడంతో అవస్థలు పడుతున్నారు. ఇప్పటికే కొందరు శ్వాసకోశ వ్యాధులు, ఆస్తమాతో బాధపడుతున్నారు. మరికొందరు పనులు సైతం మానేశారు.

తక్కువ ఖర్చు.. పర్యావరణ పరిరక్షణ

విద్యాశాఖపై ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన సమీక్షలో వంట చేసే మహిళల అవస్థల గురించి ఆరా తీసినట్లు సమాచారం. ప్రభుత్వ పాఠశాలల్లో కిచెన్ షెడ్ల ఏర్పాటు విషయమై ఆయన సంబంధిత శాఖ అధికారులతో చర్చించినట్లు తెలిసింది. ఈ పథకం అమలైతే తక్కువ ఖర్చుతో పర్యావరణ పరిరక్షణకు పాటుపడటంతో పాటు ఆర్థిక పొదుపునకు సాధ్యమవుతుంది. గ్యాస్ సిలిండర్లు, కట్టెల కొనుగోలుకు వెచ్చించాల్సిన ఖర్చు ఆదా అవుతుంది. అన్నింటి కంటే ముఖ్యంగా వంట చేసే కార్మికులు కాలుష్యంతో అనారోగ్యం బారిన పడకుండా ఉంటారు. అలాగే వారంలో రెండు ప్రభుత్వ పాఠశాలలను జిల్లా అదనపు కలెక్టర్లు సందర్శించాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారుల తనిఖీలతో పాఠశాలలో మెరుగైన విద్య బోధన, నాణ్యమైన భోజనం అందించే అవకాశాలు ఉంటాయి. పాఠశాలలో పెరిగిన విద్యార్థుల సంఖ్య ఆధారంగా అదనపు గదులు నిర్మించాలని ఆదేశించారు.

క్లుప్తంగా

ఉపాధ్యాయురాలికి డాక్టరేట్


స్రవంతి

మెదక్‌జోన్: పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు సీహెచ్. స్రవంతి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్‌ను పొందారు. ఆర్ట్స్ కాలేజీలోని హిందీ విభాగంలో ప్రొఫెసర్ డా.ధరంపాల్ ఫీహల్ పర్యవేక్షణలో అంతిమ్ దశక్ కే దళిత్ కథ సాహిత్య్ మే వైచారిక్ సంఘర్ష్ అనే అంశంపై పరిశోధన పూర్తి చేసినందుకు గాను డాక్టరేట్ సాధించారు. స్రవంతి ప్రస్తుతం మెదక్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్నారు. తన పరిశోధనకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

అయ్యో.. పసి బాలుడు
వేడి గంజి పాత్రలో పడి మృతి


మోక్షిత్

వర్గల్(గజ్వేల్): రెండేళ్ల చిన్నారి ప్రమాదవశాత్తు వేడి గంజి పాత్రలో పడిపోయాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం మాదారంలో చోటుచేసుకున్నది. గౌరారం ఎస్ఐ కరుణాకర్ రెడ్డి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ముత్తి స్వామి, మహేశ్వరి దంపతులకు కూతురు, మోక్షిత్(2) కుమారుడున్నాడు. చిన్నారి మోక్షిత్ బుధవారం ఉదయం పెదనాన్న ఎల్లం ఇంట్లో ఆడుకుంటున్నాడు. అక్కడ ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు వేడి గంజి పాత్రలో పడిపోయాడు. దీంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఎస్సైకి గాయాలు

పాపన్నపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో ఎస్సైకి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలో శుక్రవారం రాత్రి జరిగింది. నార్సింగి గ్రామానికి చెందిన విఠల్ మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్నాడు. రాత్రి విధులు ముగించుకొని స్వగ్రామానికి వస్తుండగా ఏడుపాయల శివారులో పెట్రోల్ బంకు వద్ద బైక్ స్కిట్ అయి కిందపడిపోయాడు. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతన్ని మెదక్‌కు అక్కడి నుంచి మెరుగైన వైద్యం హైద్రాబాద్‌కు తరలించారు. కాగా అంబులెన్స్‌లో ఆక్సిజన్ అయిపోయినట్లు సమాచారం. దీంతో అరగంట పాటు అతను ఇబ్బంది పడ్డట్లు తెలిసింది. ఈ విషయమై ఎస్సై శ్రీనివాస్‌గౌడ్‌ను వివరణ కోరగా తమకు ఫిర్యాదు అందలేదని చెప్పారు.

కారు బోల్తా.. స్వల్ప గాయాలు

నారాయణఖేడ్: మండలంలోని ర్యాకల్ సమీపంలో శనివారం సాయంత్రం కారు అదుపుతప్పి రోడ్డుపక్కకు దూసుకెళ్లి చేనులో బోల్తా పడింది. కారులో ఉన్నవారు స్వల్పగాయాలతో బయటపడ్డారు. రోడ్డును తవ్వి కంకర పర్చి వదిలేయడంతోనే కారు అదుపుతప్పి బోల్తా పడిందని మాజీ జడ్పీటీసీ రవీందర్‌నాయక్ వాహనదారులతో కలిసి రోడ్డుపై ఆందోళన చేశారు.

ముగ్గురు అదృశ్యం

రామాయంపేట(మెదక్): మండలంలోని రాయిలాపూర్ గ్రామంలో దంపతులతోపాటు వారి మూడేళ్ల పాప అదృశ్యమైంది. ఎస్ఐ బాల్‌రాజ్ కథనం మేరకు... గ్రామానికి చెందిన ప్రేంకుమార్ చేగుంట సమీపంలో ఉన్న ఓ కంపెనీలో పని చేస్తున్నాడు. శుక్రవారం ప్రేంకుమార్‌కు, అతని భార్య ప్రియకు గొడవ జరిగింది. అనంతరం అతడు డ్యూటీకి వెళ్లిపోయాడు. అతని భార్య, తన మూడేళ్ల కూతురుతోపాటు ఇంటినుంచి వెళ్లిపోయింది. రాత్రి ముగ్గురు ఇంటికి రాలేదు. దీంతో అతని తండ్రి సాయిలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

WANTED

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్ జీ : 18K. Ph: 9848571888, 9640400073 [SCA25005909]

■ రామకృష్ణ ఓల్డేజ్‌హోం నాగోల్ Hyd శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/పేషెంట్ల సేవ వంట/ఇంటిపని బేబీకేర్ కై M/F వర్కర్స్ కా॥ బో+వసతి + జీతం: 16-18 వేలు ఏజెంట్లకు 5వేలు కమీషన్ ఫోన్ : 9281465319, 9010680011 [SCA25005822]

■ Required collection male field executives for ageny collection, Sangareddy City, Medak City. ✆ 76598 03442, 63010 75491 [B-155]

FACULTY TEACHERS

■ Wanted Special Educator. B.Ed, HI for a School - JACKSON MISSION SCHOOL. Contact: 8885800489, 7075102777. [SCA25005929]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



- భోజన ప్రియులు ఇష్టంగా తినే ఫుడ్ బిర్యానీ
- జిల్లాలో విస్తరించిన సెంటర్లు
- వినూత్నమైన పేర్లతో నిర్వహణ
- రూ.79 నుంచి మొదలు
- ఆన్‌లైన్‌లోనూ అందుబాటులో





బిర్యానీ ప్రియులమండి

నేడు ప్రపంచ బిర్యానీ దినోత్సవం

బిర్యానీ.. ఈ పేరు వింటే ఎవరికైనా నోరూరిపోవాల్సిందే. భోజన ప్రియులు లొట్టలేసుకుంటూ ఇష్టంగా ఆరగిస్తారు. వివిధ రకాల బిర్యానీలు తయారు చేస్తూ, వినూత్నమైన పేర్లతో పలు హోటల్స్ కొలువు దీరుతున్నాయి. ఇద్దరు ఫ్రెండ్స్ కలిసినా, ఫంక్షన్, వేడుక, లంచ్, డిన్నర్ సమయంలో బిర్యానీ తింటారు. ప్రతి సంవత్సరం జూలై మొదటి ఆదివారంను ప్రపంచ బిర్యానీ దినోత్సవంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనం.

– ప్రశాంత్‌నగర్(సిద్దిపేట):

బిర్యానీ మాట వింటే చాలు ఎక్కడో ఉన్నవారు సైతం పరుగున వస్తారు. ఘుమఘుమలాడే బిర్యానీని తయారు చేయడంలో అనేక పద్ధతులు ఉన్నాయి. బిర్యానీ అనగానే కేవలం చికెన్ బిర్యానీ మాత్రమే కాదు. వెజిటేబుల్, ఆలు, ఎగ్, చేప, రొయ్య, కాజు, మటన్, నాటుకోడి బిర్యానీతో పాటు పలు రకాలున్నాయి. అయితే కొందరు ఇంట్లోనే తయారు చేస్తుండగా, అధికంగా హోటళ్లలో మిత్రులతో కలిసి తింటున్నారు. జిల్లాలోని పలు హోటళ్లలో ప్రతి రోజు దాదాపు ఐదువేల బిర్యానీలు వరకు విక్రయిస్తుండటంతో భోజన ప్రియులు ఎంతగా ఇష్టంగా తింటున్నారో అర్థం అవుతుంది.

జిల్లాలో 200 సెంటర్లు..

సిద్దిపేట పట్టణంలో పలు హోటళ్లు కేవలం బిర్యానీ మాత్రమే విక్రయిస్తూ ప్రత్యేకతను చాటుతున్నాయి. దాదాపుగా జిల్లాలో 200 వరకు బిర్యానీ సెంటర్‌లు ఉన్నాయి. మొబైల్ బిర్యానీ సెంటర్‌లు జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో మధ్యాహ్నం సమయంలో కొలువు తీరుతున్నాయి. మొబైల్, చిన్న సెంటర్‌లో బిర్యానీ ధర రూ.79 నుంచి ప్రారంభం అవుతుంది. అలాగే వివిధ హోటల్స్ పార్సిల్ ద్వారా అందిస్తుండగా, ఆన్‌లైన్‌లో కూడా ఆర్డర్ చేసి తెప్పించుకొని తింటున్నారు.



ఆకర్షించే పేర్లతో..

బిర్యానీ విక్రయించే హోటల్స్ వివిధ పేర్లతో భోజన ప్రియులను ఆకర్షిస్తున్నారు. జైల్, మండి, ట్రైన్, సూట్‌కేస్, కుండ, మన ఇంటి బిర్యానీ అని ఇలా వివిధ రకాల పేర్లతో నిర్వహిస్తున్నారు.

➤ **మండి బిర్యానీ**
ఇక్కడ నిర్వాహకులు భోజన ప్రియులను కిందే కూర్చోబెట్టి ఒక పెద్ద పాత్రలో బిర్యానీని అందిస్తారు. దానిని మిత్రులందరూ కలిసి ఒకే పాత్రలో తింటారు.

➤ **ట్రైన్ బిర్యానీ...**
రైల్వే స్టేషన్‌లో ప్లాట్ పామ్ పైకి రైల్ వచ్చినట్లు, వ్యక్తి కూర్చున్న టేబుల్‌పైకి చిన్న ట్రైన్ ద్వారా ఫుడ్ వస్తుంది. టేబుల్స్‌కు సిద్దిపేట, వరంగల్, హైదరాబాద్, కరీంనగర్ తదితర పేర్లు పెట్టారు. ఆహార ప్రియుడు తనకు నచ్చిన పట్టణం పేరు ఉన్న టేబుల్‌పై కూర్చొని బిర్యానీ తింటున్నారు.





జైల్ బిర్యానీ

హోటల్‌నే జైలుగా మార్చి ఫుడ్ లవర్స్‌ను ఆకర్షిస్తున్నారు. హోటల్‌కు వచ్చే వారిని జైల్ సెల్‌లో పెట్టి బిర్యానీ అందిస్తున్నారు. అయితే ఇక్కడ అడుగుపెట్టగానే జైలునే తలపిస్తుంది. ఆహారం జైలు సెల్‌లో కూర్చున్న వారి వద్దకే సర్వర్ వచ్చి వడ్డిస్తాడు. దీంతో ఇలాంటి వింత పేర్లతో పాటు, మంచి నాణ్యమైన బిర్యానీ అందించే హోటల్స్‌కు భోజన ప్రియులు తమ మిత్రులతో కలిసి వస్తున్నారు.

ఇష్టంగా తింటా



నేను బిర్యానీని ఇష్టంగా తింటా. సిద్దిపేట, గజ్వేల్ పట్టణాల్లో అనేక హోటల్స్‌లో తిన్నాను. ఏదైనా పని మీద బయటకు వెళ్లినప్పుడు, స్నేహితులతో కలిసినప్పుడు వారంలో రెండు సార్లు అయినా తింటా.

– కిష్టారెడ్డి, ఆర్ అండ్ ఆర్ కాలనీ, గజ్వేల్

రోజు 700 పైగా విక్రయిస్తాం



జిల్లాలో మంచి నాణ్యమైన బిర్యానీని అందిస్తామనే పేరు మాకు ఉంది. ప్రతి రోజు మా హోటల్‌లో దాదాపు 700పైగా విక్రయిస్తున్నాం. విద్యార్థులు, ఉద్యోగులు, వివిధ ప్రాంతాల నుంచి సిద్దిపేటకు వచ్చే వారు, పట్టణ వాసులు, వ్యాపారులు మా హోటల్‌కు అధికంగా వస్తారు. వారికి ఇష్టమైన బిర్యానీని ఆరగిస్తున్నారు. అధికంగా చికెన్, మటన్, ఫిష్, వెజిటెబుల్ బిర్యానీ విక్రయిస్తున్నాం.

– దుర్గరాజు, అక్షయ హోటల్, సిద్దిపేట

వినియోగదారులకు మెరుగైన సేవలు


సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో చీఫ్ ఇంజినీర్ కామేష్ తదితరులు

జహీరాబాద్ టౌన్: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని ట్రాన్స్‌కో చీఫ్ ఇంజినీర్ కామేష్ అధికారులకు సూచించారు. శనివారం జహీరాబాద్ పట్టణంతోపాటు మొగుడంపల్లి మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. గతంలో సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'సెల్‌ఫోన్ లైట్‌తో రోగులకు చికిత్స'అనే శీర్షికన వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ విషయమై ఆయన ఆస్పత్రిని సందర్శించి విద్యుత్ సరఫరా తీరుపై ఆరా తీశారు. జనరేటర్ ఆటోమెటిక్ ఆన్‌కావడం లేదని గుర్తించి, ఆస్పత్రికి మరో ఫీడర్ నుంచి విద్యుత్‌ను సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. ధనసిరి గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్‌లను పరిశీలించి, రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సత్వార్ సబ్‌స్టేషన్‌ను పరిశీలించారు. ఆయన వెంట ఎస్‌ఈ, శ్రీకాంత్, డీఈఈ లక్ష్మినారాయణ, ఏడీలు మధుసూదన్‌రావు, రజనీకాంత్, ఏఈ సతీష్ ఉన్నారు.

బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అనీల్ కుమార్


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు అనీల్‌కుమార్

సంగారెడ్డి ఎడ్యుకేషన్: బదిలీలతో పాటు పదోన్నతులు, ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అనీల్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సంగారెడ్డిలోని టీపీటీఎఫ్ భవన్‌లో జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యను విధ్వంసం చేసే విధానాలకు స్వస్తి పలికి, అందరికీ సమాన విద్యను ప్రభుత్వమే అందించాలన్నారు. ఉద్యోగులకు ఉచితంగా వైద్య సేవలు అందించకుండా, వారి నేంచే డబ్బులు తీసుకోవడం ఇదోరకమైన మోసమని విమర్శించారు. విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర సహాధ్యక్షుడు అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రైవేట్ స్కూల్స్‌లో ఎలాంటి తనిఖీలు చేయకుండా, ప్రభుత్వ పాఠశాలలను ఉపాధ్యాయులతో పర్యవేక్షణ చేయించడం సరైన విధానం కాదన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు లక్ష్మయ్య యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచందర్, ఉపాధ్యాయ సంపాదకవర్గ సభ్యులు రాంచందర్, రాష్ట్ర కౌన్సిలర్లు సంజీవయ్య, రాజారెడ్డి, భాస్కర్, కంరోద్దీన్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

టీకాలతో శునకాల ఆరోగ్యం పదిలం


శునకాలకు ఉచిత వ్యాక్సిన్ వేస్తున్న అధికారులు

సదాశివపేట(సంగారెడ్డి): కుక్కలకు టీకాలు వేయడం వల్లం ఆరోగ్యంగా ఉంటాయని మున్సిపల్ కమిషనర్ ఉమ పేర్కొన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలోని వాటర్ ట్యాంక్ ఆవరణంలో పెంపుడు కుక్కలకు బ్లూక్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. పశుసంవర్ధక శాఖ అధికారులు డాక్టర్ బాలాజీ, డాక్టర్ సోహన్‌రాజు 303 కుక్కలకు ఉచితంగా వ్యాక్సినేషన్ చేశారు. ప్రతి శునకానికి ముందుచూపుగా కరిచిన ఏం కాకుండా యాంటి రేబిస్, వ్యాక్సినేషన్ ఎఆర్‌వి, కుక్కకు అంటువ్యాధి సోకకుండా నిర్మూలనకు వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ అధికారి అశోక్‌గౌడ్, బ్లూక్రాస్ నిర్వాహకులు కుమారి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

'శాసనమండలిలో ప్రజా గొంతుక' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బీసీ కోర్ కమిటీ సభ్యులు

జహీరాబాద్ టౌన్: బీసీలకు పెనుముప్పు శాసన మండలిలో ప్రజా గొంతుక పుస్తకాన్ని శనివారం పట్టణంలోని పద్మశాలి భవనంలో బీసీ సంఘాల నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నియోజకవర్గం బీసీ కోర్ కమిటీ సభ్యులు కొండాపురం నర్సింహులు, పెద్దగొల్ల నారాయణ, విశ్వనాథ్ యాదవ్ మాట్లాడారు. బీసీ బిడ్డలకు జరుగుతున్న అన్యాయాన్ని తీన్మార్ మల్లన్న ఈ పుస్తకంలో చక్కగా వివరించారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, అశోక్, శేఖర్, తీన్మార్ మల్లన్న టీం సభ్యులు పాల్గొన్నారు.

మళ్లీ చిరుతపులి కలకలం

భయాందోళనలో ప్రజలు


ఆనవాళ్లు సేకరిస్తున్న ఫారెస్టు అధికారులు

దుబ్బాక: మళ్లీ చిరుతపులి సంచారం కలకలం రేపింది. రాయపోల్ మండలం వడ్డెపల్లి గ్రామ శివారులో చిరుతపులి సంచరిస్తుండటంతో ప్రజలు భయందోళన చెందారు. 50 రోజుల క్రితం గ్రామ శివారులో రైతు పశువుల కొట్టం వద్ద రెండు కుక్కలపై చిరుతపులి దాడి చేసి చంపిన విషయం విదితమే. మళ్లీ శుక్రవారం వ్యవసాయ పొలాల్లో పనిచేస్తున్న రైతులకు చిరుతపులి కనిపించింది. దీంతో రైతులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ షేక్ హైమద్ హుస్సేన్ శనివారం అటవీ ప్రాంతాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. రైతు నవీన్ పశువులను మేపుతుండగా గడ్డిలో శబ్దం రావడంతో చూడగా చిరుతపులి కనిపించిందని తెలిపాడు. దీంతో తన పశువులను కొట్టుకొని ఇంటికి వచ్చి గ్రామస్తులకు విషయం చెప్పాడు. చిరుత సంచరించిన ప్రాంతంలో గాలించామని, అడవిలో ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశామని ఫారెస్టు అధికారి తెలిపారు. బీట్ ఆఫీసర్లు జహంగీర్, వేణు ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

హవేళిఘణాపూర్(మెదక్): ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మెదక్‌రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అవుసులపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన అన్వర్(32) భార్య పిల్లలతో కలిసి జీవిస్తున్నాడు. రాత్రి కుటుంబ సభ్యులతోపాటు భోజనం చేసి పడుకున్నాడు. అర్ధరాత్రి భార్య అస్మా లేచి చూసేసరికి ఫ్యానుకు వేలాడుతూ కనిపించాడు. దీంతో వెంటనే పక్కింటివారిని లేపి కిందకు దించి ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల వల్లే తన భర్త మృతి చెందాడని మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది.

శాలిపేట గ్రామంలో..

హవేళిఘణాపూర్(మెదక్): ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండల పరిధిలో జరిగింది. వివరాలిలు... శాలిపేట గ్రామానికి చెందిన పచ్చంటి భూపాల్(35) కొన్ని రోజులుగా ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం పొలం వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. గమనించిన రైతులు కుటుంబ సభ్యులకు తెలుపగా వెంటనే అంబులెన్సులో మెదక్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

భూ వివాదంలో రైతు ఆత్మహత్యాయత్నం

నిజాంపేట(మెదక్): భూ వివాదంలో మనస్తాపం చెందిన రైతు ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన నిజాంపేట మండలంలోని కల్వకుంట గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు... గ్రామానికి చెందిన బొడిగె రామస్వామికి మూడెకరాల నాలుగు గుంటల భూమి ఉంది. కానీ తన సమీప బంధువులు అక్రమంగా పట్టా భూమిని మార్చుకున్నారని తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. కొంతకాలంగా వీరి మధ్య భూ వివాదం జరగడంతో గ్రామస్తులు మాట్లాడినా పరిష్కారం కాలేదు. దీంతో మనస్తాపానికి గురైన రామస్వామి శుక్రవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే సిద్దిపేటలోని ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు.

నగల కోసమే వృద్ధురాలి హత్య

- నిందితుడి అరెస్టు
- వివరాలు వెల్లడించిన ఏసీపీ

గజ్వేల్‌రూరల్: నగల కోసమే వృద్ధురాలిని హత్య చేసిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. గత నెల 24న గజ్వేల్ మండలంలో వృద్ధురాలు హత్యకు గురైన విషయం విదితమే. శనివారం పోలీస్‌స్టేషన్‌లో సీఐ సైదా, అదనపు సీఐ ముత్యంరాజులతో కలిసి ఏసీపీ నర్సింహులు కేసు వివరాలు వెల్లడించారు. ధర్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన నల్ల సత్తవ్వ(70) గ్రామ శివారులోని తన వ్యవసాయ పొలానికి వెళ్లింది. ఈ క్రమంలో అటుగా వెళ్తున్న ఓ రైతు చూసి విఘతజీవిగా పడిఉన్న సత్తమ్మను గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఆమె ఒంటిపై ఉన్న నగల కోసమే దుండగుడు ఆమె మెడపై పదునైన ఆయుధంతో దాడి చేసి పొడిచినట్లు పోలీసులు గుర్తించారు. విచారణలో భాగంగా హత్య జరిగిన ప్రాంతంలోని సీసీ కెమెరాల ద్వారా నిందితుడు మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం కోమటిపల్లికి చెందిన కిచ్చిగారి శివశంకర్‌గా గుర్తించి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో గత నెల ద్విచక్ర వాహనంపై గజ్వేల్‌కు వచ్చి తిరిగి వెళ్తూ వృద్ధురాలి నగలను దోచుకునేందుకు ప్రయత్నించగా, ఆమె ప్రతిఘటించడంతో ఆమె చేతిలోని కొడవలితో హత్యచేసి పారిపోయినట్లు నేరం అంగీకరించాడు. ఇతడు చేగుంటలో ఆయుర్వేద బోన్‌సెట్టింగ్ వైద్యునిగా చలామణి అవుతూ చోరీలకు పాల్పుతున్నాడు. నిందితుడి నుంచి బంగారు గొలుసు, చెవి కమ్మలు, కొడవలి, 5 ద్విచక్ర వాహనాలతో పాటు ఫేక్ నంబర్ ప్లేట్లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

అయినవాళ్లే అంతమొందించారు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ అనీల్‌కుమార్

- ఆస్తి తగాదాలతో వ్యక్తి దారుణ హత్య
- తాలెల్మ శివారులో పూడ్చేసిన వైనం
- నలుగురు రిమాండ్
- వివరాలు వెల్లడించిన జోగిపేట సీఐ


మంగళి సాయిలు

వట్‌పల్లి(అందోల్): ఆస్తి తగాదాలతో అయినవాళ్ల చేతిలోనే ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటనలో నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. గత నెల18న ఇంటి నుంచి పొలం పనులకు వెళ్లిన వ్యక్తి కనపడకుండా పోయిన విషయం తెలిసిందే. జోగిపేట సీఐ అనీల్‌కుమార్ కేసు వివరాలు వెల్లడించారు. పల్వట్ల గ్రామానికి చెందిన మంగళి సాయిలు(53)తన భార్యతో కలిసి జోగిపేటలో ఉంటున్నాడు. అయితే సాయిలుకు అతడి సోదరులకు, సోదరీలకు కొంతకాలంగా ఆస్తి పంపకాల విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయమై పలుమార్లు స్వగ్రామంలో పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టినా పరిష్కారం కాలేదు. తీసుకున్న డబ్బులు తిరిగి చెల్లించకపోవడం, భూ విషయమై సాయిలుతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని చంపాలని అతని తమ్ముడు మల్లేశంతో పాటు భావలు పథకం రచించారు. ఈ క్రమంలో సాయిలు గత నెల 18న పొలం పనులు చేసేందుకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. విత్తనాలు కొనుగోలు చేసి రాత్రి 8 గంటల సమయంలో జోగిపేటకు బైక్‌పై వస్తున్న క్రమంలో తమ్ముడు మల్లేశంతో పాటు బావ సురేష్ వెంబడించి తాలెల్మ శివారులో అడ్డగించారు. రోడ్డు పక్కకు లాక్కెళ్లి బండ రాళ్లతో తలపై మోదగా అతడు అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. తర్వాత మల్లేశం తన మేనల్లుడు మహేష్‌కు ఫోన్‌చేసి గడ్డపార తీసుకొని, మీ నాన్న లింగయ్యను తీసుకురావాలని చెప్పాడు. నలుగురు కలిసి ఓ కాలువలో గోతి తీసి సాయిలును పూడ్చి పెట్టి వెళ్లిపోయారు. వారం రోజులు గడిచినా సాయిలు ఇంటికి రాకపోవడంతో గత నెల26న భార్య నవరాణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే మల్లేశంతో పాటు బావలు సురేష్, లింగయ్య, మేనల్లుడు మహేష్ వారి ఇళ్లకు తాళాలు వేసి వెళ్లిపోయారు. దీంతో వారిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నారు. శనివారం మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. నలుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు ఛేదించిన వట్‌పల్లి ఎస్ఐ లవకుమార్, క్రైం టీం సురేష్, సంజీవులుతో పాటు సిబ్బందిని సీఐ అభినందించారు.